గుట్టలో లక్ష్మీనరసింహస్వామి తిరువీధి సేవోత్సవం

గుట్టపై కొత్తగా ఏర్పాటు చేసిన ప్రసాదాల టికెట్ కౌంటర్లు

యాదగిరిగుట్ట, ఏప్రిల్30 : యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ స్వామివారికి తిరువీధి సేవను మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా అలంకరించారు. స్వామివారిని గరుఢవాహనంపై, అమ్మవారిని తిరుచ్చి వాహనంపై వేంచేపు చేసి తిరుమాఢవీధుల్లో ఊరేగించారు. తెల్లవారు జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. స్వామివారికి కల్యాణోత్సవ సేవ అత్యంత వైభవంగా సాగింది. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వెంచేపు చేసి నిత్య కల్యాణతంతును చేపట్టారు. సాయంత్రంవేళ స్వామివారికి దర్బార్‌సేవ, రాత్రి తిరువారాధన చేపట్టారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామికి ఆకుపూజ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు సుమారు 9వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అధికారులు వెల్లడించారు. స్వామివారి ఖజానాకు రూ. 23,00,746 ఆదాయం సమకూరిందని ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

శివాలయం ఎదురుగా ప్రసాదాల టికెట్ కౌంటర్

స్వామివారి కొండపైన అనుబంధ రామలింగేశ్వర్వస్వామి ఆలయం ఎదుట ప్రసాదాల టికెట్ కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. దీనిని మంగళవారం ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, ఈఓ భాస్కర్ రావు ప్రారంభించారు. ప్రసాద విక్రయశాల వద్దనే టికెట్ కౌంటర్ ఉండటంతో భక్తుల రద్దీ పెరిగి ఇబ్బందులు ఎదురవులున్నాయి. దాంతో టికెట్ కౌంటర్‌ను వేరుగా ఏర్పాటు చేశారు.

ధాన్యం కొనుగోళ్లపై దృష్టి సారించాలి

- ఎంపీపీ నరాల నిర్మల

సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నిర్మల

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 30: ధాన్యం కొనుగోళ్లపై అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఎంపీపీ నరాల నిర్మల అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో తాగు నీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. అధికారులు అందుబాటులో ఉండి వేసవిలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు సుబ్బారు బీరుమల్లయ్య, పీఏసీఎస్ చైర్మన్ డాక్టర్ నోముల పరమేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాస్‌రావు, వైస్ ఎంపీపీ ఏనుగు సంజీవరెడ్డి, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

యాదగిరిగుట్ట, ఏప్రిల్30: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ బీఆర్ఎస్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, కార్యదర్శి అంకం నర్సింహ, నాయకులు పేరబోయిన సత్యనారాయణ, ముక్కర్ల సతీశ్, ఆరె శ్రీధర్, బాలయ్య, బిట్టు కుమార్, ర్యాకల రాజుగౌడ్, దండెబోయిన వీరేశం పాల్గొన్నారు.

మాదిగ వాడల్లో ఓట్లడిగే అర్హత కాంగ్రెస్‌కు లేదు

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి దేవేందర్

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 30: భువనగిరి పట్టణంలోని మాదిగ వాడల్లో ఓట్లు అడిగే అర్హత కాంగ్రెస్ పార్టీకి లేదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి దేవేందర్‌మాదిగ అన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ భువనగిరి మున్సిపాలిటీలో మాదిగలకున్న వైస్ చైర్మన్ పదవిని తొలగించారని, మాదిగల పదవులను లాక్కున్న ఘనత కాంగ్రెస్ పార్టీదే అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలకు టికెట్లు ఇవ్వకుండా.. మాదిగలను పార్లమెంట్‌లో మాట్లాడకుండా చేసిన, మాదిగల పదవులు లాక్కున్న కాంగ్రెస్‌కు తాము ఓటు వేయబోమన్నారు. మాదిగ వాడల్లో తిరిగే అర్హత ఎమ్మెల్యేకు గానీ, కాంగ్రెస్ నాయకులకు గానీ లేదని, ఒకవేళ వచ్చినా అడ్డుకుంటామని హెచ్చరించారు.

ప్రజల్లో కాంగ్రెస్‌పై వ్యతిరేకత

- మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రమేశ్‌గౌడ్

సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నల్లమాస రమేశ్‌గౌడ్

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 30 : ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెస్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని భువనగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నల్లమాస రమేశ్‌గౌడ్ అన్నారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడిచినా ఆరు గ్యారంటీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. రైతులందరికీ రైతుబంధు రాలేదని, రుణమాఫీ కాలేదని, యాసంగిలో సాగునీళ్లు లేక పంటలు ఎండిపోయాయని, ధాన్యానికి రూ.500 బోనస్ అందలేదని తెలిపారు. గత కేసీఆర్ ప్రభుత్వం రైతుల కోసం అనేక పథకాలు అమలు చేసిందని, దాంతో వ్యవసాయం పండుగలా సాగిందని పేర్కొన్నారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం సదరు పథకాలను కొనసాగించడంలో విఫలమైందన్నారు. అందుకే రైతులు, ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్నే కోరుకుంటున్నారని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో సింగిల్‌విండో మాజీ చైర్మన్ చందుపట్ల రాజేశ్వర్‌రావు, మాజీ ఎంపీటీసీ బింగి జంగయ్య, భువనగిరి మండల బీఆర్ఎస్ ప్రచార కార్యదర్శి కొల్లోజు వెంకటాచారి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కంకల కిష్టయ్య పాల్గొన్నారు.

కారును ఢీ కొట్టిన కంటైనర్

- నలుగురికి తీవ్రగాయాలు

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 30 : కారును కంటైనర్ ఢీ కొట్టడంతో నలుగురికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని ఎన్‌హెచ్ 163పై మంగళవారం చోటు చేసుకుంది. యాదగిరిగుట్ట సీఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌కు చెందిన సోమన ర్సయ్య కంటైనర్ ట్రక్కుతో వరంగల్ నుంచి హైదరాబాద్‌కు బయల్దేరాడు. మండలంలోని వంగపల్లి వద్ద మోటకొండూర్‌కు వెళ్లే క్రాస్ రోడ్డు వద్ద ముందుగా వెళ్తున్న కారును ఢీకొట్టిన కంటైనర్ అదుపుతప్పి రోడ్డు పక్కన పల్టీ కొట్టింది. కంటైనర్ ఢీకొనడంతో కారు ముందుగా వెళ్తున్న బొలేరో, బైక్‌ను ఢీ కొట్టింది. దాంతో కారులో ప్రయాణిస్తున్న నరోత్తంరెడ్డి, రజనీకాంత్‌రెడ్డి, బొలేరో వాహన డ్రైవర్ రాజు, బైక్‌పై వెళ్తున్న భిక్షపతికి తీవ్ర గాయాలయ్యాయి. కంటైనర్ డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాద సమయంలో హైదరాబాద్ నుంచి వరంగల్‌కు వెళ్తున్న మంత్రి కొండా సురేఖ తన కాన్వాయ్‌ని నిలిపి, క్షతగాత్రులను 108 వాహనంలో భువనగిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని, కంటైనర్ డ్రైవర్ సోమ నర్సయ్య ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.4 లక్షలు తరలిస్తుండగా పట్టుకొని సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

నాలుగు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత

- పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయం
- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, పక్కన జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్, మాజీ ఎమ్మెల్యేలు కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్

చౌటుప్పల్ రూరల్, ఏప్రిల్ 30 : భారత దేశ చరిత్రలోనే గెలిచిన నాలుగు నెలల్లోనే ప్రజావ్యతిరేకతను ఎదుర్కొంటున్న దుస్థితి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏర్పడిందని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని దామెర గ్రామంలో జరిగిన పట్టణ, మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చుతామంటూ దేవుడిపై ఒట్లు వేసే పరిస్థితి సీఎం రేవంత్‌రెడ్డికి వచ్చిందని, ఆయన ఒట్లు పెట్టినా ప్రజలు నమ్మడం లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతుల సమస్యలు పట్టించుకునే నాథుడే కరువయ్యారన్నారు. అవినీతి అని ఫోన్‌ట్యాపింగ్ అని విర్రవీగి బొక్కబోర్ల పడ్డారని ఎద్దేవా చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించలేక అహంకారంతో కాంగ్రెస్ నాయకులు విర్రవీగుతున్నారన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి మిల్లర్లతో కుమ్మక్కై రైతులకు గిట్టుబాటు ధర ఇయ్యకుండా రైతులను దోచుకొని రేవంత్‌కు మూటలు మోస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ నాయకుల అవినీతిని ప్రజలు గమనిస్తున్నారని, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను ప్రజలు గెలిపియ్య బోతున్నారని అన్నారు. సమావేశంలో జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, భూడిద భిక్షమయ్యగౌడ్, నియోజక వర్గ ఎన్నికల పరిశీలకుడు వెంకటనారాయణ, నాయకులు పల్లె రవికుమార్, పాల్వాయి శ్రవంతి, జడ్పీటీసీలు, వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్లు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

టెన్త్‌లో కృష్ణవేణి విద్యార్థుల ప్రతిభ

10 జీపీఏ సాధించిన కృష్ణవేణి స్కూల్ విద్యార్థిని రిత్వికను అభినందిస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 30 : పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు మంగళవారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబర్చారు. పాఠశాకు చెందిన మాదిరెడ్డి రిత్విక 10 జీపీఏ సాధించింది. విద్యార్థిని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి అభినంధించారు. దాంతో పాటు పాఠశాలకు చెందిన 17 మంది విద్యార్థులు 9 జీపీఏ సాధించినట్లు ప్రిన్సిపాల్ అఖిలారఘు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు. అనంతరం పాఠశాల ఆవరణలో పటాకులు కాల్చి స్వీట్లు పంపిణీ చేసుకున్నారు.

సాధన స్కూల్‌లో ఉత్తమ ఫలితాలు

10 జీపీఏ సాధించిన సాధన స్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న డీఈఓ కె.నారాయణరెడ్డి

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 30: పట్టణంలోని సాధన స్కూల్ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. పాఠశాలకు చెందిన ఎ.శృతీక్‌రెడ్డి, ఎస్.అక్షిత 10 జీపీఏ సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను డీఈఓ కె.నారాయణరెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ ధనాప్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఎస్.వెంకట్‌రెడ్డి, పి.రవి, సీహెచ్.భవాని, స్వప్న, అభినందించారు.

అనంతరం పాఠశాలలో సంబురాలు జరుపుకొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

వలిగొండ, ఏప్రిల్ 30 : మండలంలోని కంచనపల్లి గ్రామానికి చెందిన మెరుగు అంజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అతడితో కలిసి చదువుకున్న స్నేహితులు(1997 పదో తరగతి బ్యాచ్) మంగళవారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ. 50 వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో మామిడి ప్రభాకర్‌రెడ్డి, బుగ్గ వెంకటేశం, సుధాకర్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

మేడేను ఘనంగా నిర్వహించాలి

- సీపీఎం రాష్ట్ర నాయకుడు శోభన్

బీబీనగర్, ఏప్రిల్ 30 : బుధవారం మేడే ఉత్సవాలను శ్రామిక శక్తి చాటేలా, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేలా నిర్వహించాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు శోభన్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సీపీఎం మండల కార్యదర్శి గాడి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చి కార్మికుల హక్కులను కాలరాస్తున్నదన్నారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం పెంపు, కార్మికుల జీవితాలను దుర్భరం చేసిన మోదీని గద్దె దించాలని పిలుపునిచ్చారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు కట్టా శేఖర్, దండిపాయిన శ్రీశైలం, యాదగిరి, విష్ణు, సంతోష్‌కుమార్, కృష్ణ పాల్గొన్నారు.

పార్లమెంట్ అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 30 : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా భువనగిరి ఎంపీ స్థానానికి పోటీ చేస్తున్న అభ్యర్థులకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత్ కె. జెండగే మంగళవారం గుర్తులను కేటాయించారు. ప్రధాన పార్టీల అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యతగా పార్టీ గుర్తులను కేటాయించగా, మిగతా అభ్యర్థులకు ఇతర గుర్తులను కేటాయించారు. స్వతంత్ర అభ్యర్థి తాళ్లపల్లి రమేశ్‌గౌడ్‌కు రోటీ మేకర్ కేటాయించగా.. అది కారును పోలినట్లుగా ఉంది.

కుక్కల దాడిలో 12 గొర్రెలు మృతి

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 30 : గొర్రెల మందపై సోమవారం రాత్రి కుక్కలు దాడి చేయడంతో 12 గొర్రెలు మృతి చెందాయి. భూదాన్ పోచంపల్లికి చెందిన బాత్క లింగయ్య గొర్రెలు, మేకలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం పట్టణ శివారులో ఏర్పాటు చేసుకున్న దొడ్డిలో గొర్రెల మందను వదిలి ఇంటికి వెళ్లాడు. అర్ధ రాత్రి మందపై కుక్కలు దాడి చేయడంతో 12 గొర్రెలు మృతి చెందాయి. ఉదయం దొడ్డివద్దకు వెళ్లి చూసే సరికి అప్పటికే గొర్రెలు మృతి చెంది ఉన్నాయి.

మున్సిపల్ వైస్ చైర్మన్ బాతుక లింగస్వామి ఘటనా స్థలాన్ని సందర్శించారు. ప్రభుత్వం బాధితుడిని ఆదుకోవాలని ఆయన కోరారు.

నేటి నుంచి వంగపల్లిలో వేసవి క్రీడా శిక్షణ

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 30 : ఈ నెల ఒకటో తేదీ నుంచి 31 వరకు మండలంలోని వంగపల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు కేసరి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రేగు బాల నర్సయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా క్రీడలు, యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్ కోచ్‌లు గుండ్లపల్లి వెంకటేశ్, మంగళగిరి నరేశ్ పర్యవేక్షణలో బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీఆర్ఎస్ పార్టీపై విమర్శలను తిప్పికొట్టాలి

- పార్టీ సోషల్ మీడియా మండల కన్వీనర్ సురేశ్

రాజాపేట, ఏప్రిల్ 30 : బీఆర్ఎస్ పార్టీపై బీజేపీ, కాంగ్రెస్ నాయకులు సోషల్ మీడియాలో చేస్తున్న విమర్శలను తిప్పికొట్టాలని బీఆర్ఎస్ సోషల్ మీడియా మండల కన్వీనర్ గంధమల్ల సురేశ్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు నెలల కాంగ్రెస్ పాలనలో వైఫల్యాలను ఎండగడుతూ సోషల్ మీడియా వారియర్స్ విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు పడుతున్న కష్టాలు, పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి, అమలైన సంక్షేమ పథకాలతో పాటు భువనగిరి బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్ గెలుపు కోసం వారియర్స్ ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

రాజాపేట, ఏప్రిల్ 30 : మండలంలోని నెమిలేటి గ్రామానికి చెందిన గవ్వల భాను(29) ఆర్థిక ఇబ్బందులతో మనస్థాపానికి గురై మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భాను ఇంటి ఆర్థిక పరిస్థితి బాగా లేక పోవడంతో కొంత కాలంగా హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తూ అక్కడే ఉంటున్నాడు. దమ్మాయిగూడలో బంధువుల ఇంట్లో పండుగ ఉందని ఇంట్లో చెప్పి వెళ్లాడు. నెమిలే గ్రామానికి వచ్చి తన వ్యవసాయ బావివద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

2న సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు

చౌటుప్పల్, ఏప్రిల్ 30 : ఈ నెల 2న చౌటుప్పల్‌లోని షాదిఖానలో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు సమాచార హక్కు వికాస సమితి జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఖుర్షీద్ పాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సమాచార హక్కుచట్టం మాజీ కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు, మాజీ ఇంజినీర్ ఇన్ చీఫ్ ఎంఏ. కరీం, ఆజాద్ హింద్ ఫౌజ్ జాతీయ అధ్యక్షుడు ఎంఏ. ముజీబ్, సమాచార వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు యర్రమాద కృష్ణారెడ్డి పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. సదస్సులో విద్యావంతులు, మేధావులు, స్వచ్ఛంద సంస్థల బాధ్యులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేడు రామన్నపేటలో క్యామ మల్లేశ్ ప్రచారం

రామన్నపేట, ఏప్రిల్ 30 : మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం 5 గంటలకు బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్ ప్రచారం చేపట్టనున్నట్లు బీఆర్ఎస్ మండల కార్యదర్శి పోశబోయిన మల్లేశం తెలిపారు.కార్యక్రమంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, జడ్పీచైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పాల్గొంటారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

జాతీయ లోక్‌అదాలత్‌లో అధిక కేసులు పరిష్కరించాలి

- సీనియర్ సివిల్ జడ్జి మాధవీలత

సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి వి.మాధవిలత

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 30: జూన్ 8న నిర్వహించే జాతీయలోక్ అదాలత్‌లో అధిక కేసులు పరిష్కారమయ్యేలా అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని సీనియర్ సివిల్ జడ్జి వి.మాధవీలత సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ. జయరాజు సూచన మేరకు మంగళవారం పట్టణంలోని జిల్లా కోర్టులో ఆలేరు, రామన్నపేట, భువనగిరి, చౌటుప్పల్ జూనియర్ సివిల్ జడ్జిలతో జాతీయ లోక్‌అదాలత్‌పై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీ పడదగిన కేసులను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పోలీసు యంత్రాంగం, న్యాయవాదులతో సమావేశాలు నిర్వహించి అధిక కేసులు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయమై జూనియర్ సివిల్ జడ్జిలకు పలు సూచనలు చేశారు.

ప్రధాన సీనియర్ సివిల్ జడ్జికి శుభాకాంక్షలు

భువనగిరి కోర్టు ప్రధాన సీనియర్ సివిల్ జడ్జిగా వి.మాధవీలత మంగళవారం బాధ్యతలు చేపట్టారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. రంగారెడ్డి జిల్లా కోర్టు నుంచి ఆమె భువనగిరికి బదిలీపై వచ్చారు. కార్యక్రమములో యదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ.జయరాజు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.కవిత, భువనగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.హరినాథ్, ఉపాధ్యక్షురాలు జయ, కార్యదర్శి కృష్ణ, అసోసియేషన్ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ట్రైనీ ఐఏఎస్‌ల బృందం

శిక్షణ ఐఏఎస్‌లతో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె. జెండగే

భువనగిరికలెక్టరేట్, ఏప్రిల్ 30 : జిల్లాలో జాతీయ ఉపాధి హామీ పనులు, గ్రామపంచాయతీల నిర్వహణపై అవగాహన కోసం వచ్చిన ఆరుగురు ట్రైనీ ఐఏఎస్‌ల బృందం మంగళవారం జిల్లా కలెక్టర్ హనుమంత్ కె. జండగేను మర్యాద పూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా పలు అంశాలపై కలెక్టర్ వారికి అవగాహన కల్పించారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో రెండు వారాల శిక్షణలో భాగంగా ఐఏఎస్ 2022 బ్యాచ్‌కు చెందిన సభ్యులు ఉదయం భువనగిరి మండలం తుక్కాపురం గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో ట్రైనీ ఐఏఎస్‌లు నారాయణఅమిత్, కిరణ్మయి, వికాస్ మహాతో, శారద శుక్లా, ఉమాశంకర్‌ప్రసాద్, మయాక్‌సింగ్ ఉన్నారు. వారి వెంట జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి ఎంఏ. కృష్ణన్, జిల్లా పరిషత్ సీఈఓ శోభారాణి, జిల్లా పంచాయతీ అధికారి సునంద, మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ నోడల్ అధికారి డాక్టర్ పి. శ్రీనివాస్, కోర్స్ ఇన్‌చార్జి ఆర్. మాధవి, ఏపీడీ శ్యామల, ఉన్నారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు : డీసీపీ రాజేశ్‌చంద్ర

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 30: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి అక్రమంగా మద్యం తరలించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీసీపీ రాజేశ్‌చంద్ర ఒక ప్రకటనలో హెచ్చరించారు.

జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా రూ.7,76,000 నగదు, 32.85 లీటర్ల మద్యం పట్టుకొని, 20 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఎలాంటి ఆధారాలు లేకుండా డబ్బులు తీసుకెళ్లినా, అక్రమంగా మద్యం తరలించిన వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

అంకిత భావంతో పని చేస్తేనే గుర్తింపు

- జడ్పీ సీఈఓ శోభారాణి

సూపరింటెండెంట్ చంద్రమౌళిని సన్మానిస్తున్న జడ్పీ సీఈఓ శోభారాణి

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 30 : ఉద్యోగులు అంకితభావంతో పనిచేసినప్పుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందని జడ్పీ సీఈఓ శోభారాణి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ చంద్రమౌళి ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సీఈఓ విష్ణువర్ధన్ రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హరీశ్, స్టేట్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రెసిడెంట్ ఎంపాల సత్యనారాయణరెడ్డి, ఎంపీడీఓ రాపర్తి భాస్కర్, బాలశంకర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మండల పరిషత్ సూపరింటెండెంట్‌కు సన్మానం

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 30 : స్థానిక మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ మద్ది శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఉద్యోగ విరమణ పొందడంతో కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. శ్రీనివాస్‌రెడ్డి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ తండా మంగమ్మాశ్రీశైలంగౌడ్, ఎంపీడీఓ నిరంజన్‌వలి, ఎంపీఓ పద్మావతి, ఇన్‌చార్జి పర్యవేక్షకుడు విక్టరి జోగు, పీఆర్ఏఈ సునీత, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, ప్రదీప్, సోమయ్య పాల్గొన్నారు.

మోదీ పాలనకు చరమగీతం పాడాలి

- సీపీఎం రాష్ట్ర నాయకుడు పాలడుగు భాస్కర్

సమావేశంలో మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 30 : ప్రజా వ్యతిరేక కార్యకలాపాలను సాగిస్తున్న కేంద్రంలోని మోదీ పాలనకు ప్రజలు చరమగీతం పాడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని కోదండరామిరెడ్డి భవనంలో జరిగిన పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పలు దేశాలు అభివృద్ధిలో పోటీ పడుతుంటే మన దేశం మాత్రం ధరల పెరుగుదలలో పోటీపడే స్థితికి దిగజారిందన్నారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను దెబ్బతీయడంతో నిరుద్యోగం పెరిగి, అభివృద్ధి కుంటుపడిందని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ, మండల కార్యదర్శి పగిళ్ల లింగారెడ్డి, పట్టణ కార్యదర్శి కోడె బాల్‌నర్సింహ, నాయకులు కోట రామచంద్రారెడ్డి, ప్రసాదం విష్ణు, మంచాల మధు, పత్తి భిక్షపతి, భేతి కమలమ్మ, కోట రమేశ్ పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇండ్లల్లో చోరీ

రాజాపేట, ఏప్రిల్ 30 : మండలంలోని బొందుగుల గ్రామంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళం వేసి ఉన్న ఐదిండ్లల్లో చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మర్ల మల్లేశం, శ్రీశైలం, సిద్దులు, బాలనర్సయ్య, శనిగరం యాదగిరి తమ ఇండ్లకు తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి వేరే గ్రామాల్లోని బంధువుల ఇండ్లకు వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు వారి ఇండ్ల తాళాలను పగులగొట్టి ఇంట్లో ఉన్న బంగారం, నగదును ఎత్తుకెళ్లారు. ఐదు ఇండ్లల్లో రెండు గ్రాముల బంగారం, 25 తులాల వెండి, రూ.70 వేల నగదు చోరీకి గురైనట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సుధాకర్‌రెడ్డి ఘటనా స్థలాన్ని సందర్శించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.